క్లుప్తంగా

డిగ్రీ కళాశాల కోసం భిక్షాటన



భిక్షాటన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకులు ఆదివారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు అక్కెం నాగరాజు మాట్లాడుతూ 2014, 2018 ఎన్నికల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మండల ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. మండలంలోని వెయ్యి మందికి పైగా విద్యార్థులు డిగ్రీ చదువు కోసం కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. నిరుపేద విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపివేస్తున్నారని, డిగ్రీ కళాశాల మంజూరు చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, అజయ్, రాకేశ్, సునీల్, కిరణ్, అజయ్, నాగరాజు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

సిరిసిల్లటౌన్: పార్లమెంటు భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతికి ఆహ్వానం పలుకకపోవడాన్ని ఆక్షేపిస్తూ ఆదివారం సిరిసిల్ల అంబేద్కర్ చౌక్‌లో సీపీఐ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. రాజదండం వద్దురా.. రాజ్యాంగం ముద్దురా అనే నినాదాలతో నిరసనలు హోరెత్తించారు. రాజ్యాంగ స్ఫూర్తిని చాటాల్సిన ప్రధాని ఇటువంటి చర్యలకు పాలపడటం సరికాదన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న నరేంద్ర మోదీ ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పంతం రవి, కడారి రాములు, వడ్డేపల్లి లక్ష్మణ్, రమేశ్ పాల్గొన్నారు.

నేటి ముస్తాబాద్ బంద్‌కు సహకరించాలి

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో అక్రమ నిర్మాణాలకు వ్యతిరేకంగా అఖిల పక్షం ఆధ్వర్యంలో సోమవారం ఇచ్చిన బంద్ పిలుపునకు అందరు సహకరించాలని అఖిల పక్షం నాయకులు వొరగంటి తిరుపతి, మెంగని మహేందర్, ఉపేంద్ర కోరారు. పంచాయతీ అధికారులు అనుమతుల పేరుతో అడ్డగోలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారి వైఖరికి నిరసనగా చేపట్టిన బంద్‌లో వస్త్ర వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, పెట్రోలు బంక్‌లు, కిరాణ దుకాణ యజమానులు సహకరించాలని కోరారు.

నిధులున్నా.. పనులు సున్నా

- రహదారులకు నిధులున్నా పూర్తికాని మరమ్మతు పనులు
- గ్రామాల్లో తొలగని రహదారి సమస్యలు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు



అధ్వానంగా తయారైన మామిడిపల్లి-నిజామాబాద్ రహదారి

కోనరావుపేట: మండలంలోని రహదారి సౌకర్యం లేక కొన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరికొన్ని గ్రామాల్లో నిధులున్నా పనులు జరుగడం లేదు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని ఈ రోడ్లకు నిధులు మంజూరై, ఆర్భాటంగా శంకుస్థాపనలు కూడా పూర్తి చేసినా, అధికారుల ఉదాసీనత, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

➡ మండలంలోని సుద్దాల, కనగర్తి, నిజామాబాద్, వెంకట్రావుపేట, కొండాపూర్, నిమ్మపల్లి గ్రామాలను కలుపుతూ ఉన్న రహదారి మరమ్మతుకు రూ.83 లక్షలు మంజూరు అయి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభించడంలేదు.

➡ మామిడిపల్లి-నిజామాబాద్ గ్రామాల మధ్య పూర్తిగా దెబ్బతిన్న రహదారి మరమ్మతుకు రూ.కోటి 3 లక్షలు మంజూరైనా పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

➡ మామిడిపల్లి-అజ్మీరాతండా వరకు గల రోడ్డుకు రూ.4 కోట్లు పనులను ఎమ్మెల్యే రమేశ్ బాబు కొన్ని నెలల క్రితమే ప్రారంభించినా పనులు పూర్తి కాలేదు.

➡ చంద్రంపేట-నుంచి మరిమడ్ల రహదారి కోసం రూ.3.50 కోట్లు మంజూరై ఏళ్లు గడుసున్నా కల్వర్టులు, రోడ్డు నిర్మాణం చేపట్టాల్సింది.

➡ కోనరావుపేట మండలం సుద్దాల-రామన్నపేట గ్రామాల మధ్య ఉన్న రహదారి కంకర తేలి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా ఇప్పటి వరకు రాలేదు.

➡ వేములవాడ-మర్తనపేట రహదారికి రూ.45 లక్షలు వచ్చినా పనులు జరుగడం లేదు.

➡ జెడ్పీ రోడ్డు నుంచి కొండాపూర్ వరకు గల రోడ్డుకు రూ.25 లక్షలు మంజూరు అయ్యాయి. కాని పనులు ప్రారంభించలేదు.

ఇప్పటికైనా ఈ పనులను పూర్తి చేసే విషయంలో అధికారులు చొరవతీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారుల నిర్మించాలి



మామిడిపల్లి నుంచి నిజామాబాద్ వరకు రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరైనా పనులు జరుగడం లేదు. ఇటు కోనరావుపేటకు, అటు వేములవాడకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలి. రహదారులకు మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– కాటెపెల్లి వేణుగోపాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు, మామిడిపల్లి

వాహనాలు పాడవుతున్నాయి



ప్రతి రోజూ ఈ రహదారిలో ఆటోలో పాలు తరలిస్తుంటా. మండలంలోని నిమ్మపల్లి, కొండాపూర్, వెంకట్రావుపేట, కనగర్తి, సుద్దాల గ్రామాల మీదుగా ఉన్న రహదారి మరమ్మతుకు కొన్ని నెలల క్రితమే నిధులు మంజూరైనట్లు చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతు జరుగడం లేదు.

– ఈర్ల తిరుపతి, వాహనదారుడు నిజామాబాద్

త్వరలోనే ప్రారంభిస్తాం



ఈ రహదారులకు ఇటీవలే నిధులు వచ్చాయి. కొన్ని రహదారులకు ప్రతిపాదనలు పంపించాం. చంద్రంపేట-మరిమడ్ల రహదారి పనులు దాదాపు పూర్తయ్యాయి. నిమ్మపల్లి ప్రాజెక్ట్ వద్ద కల్వర్టులు చేయాల్సింది. మామిడిపల్లి-నిజామాబాద్, తదితర రహదారి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి.

– సతీశ్, ఏఈ, రోడ్లు భవనాల శాఖ

కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



యూత్ డిక్లరేషన్ పత్రాన్ని చూపిస్తున్న నాయకులు

వేములవాడ: కాంగ్రెస్ నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రవేశపెట్టిన యూత్ డిక్లరేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు సాగారం వెంకటస్వామి కోరారు. పట్టణంలోని ఆది శ్రీనివాస్ నివాసంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న యువతీ, యువకులు 766186699899 ఆన్‌లైన్ నంబర్‌కు డయల్ చేస్తే వారు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెబితే ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, మహిళలకు స్కూటీ బహుమతులు పొందవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని జూన్ 18 వరకు కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కూరగాయల కొమురయ్య, చిలుక రమేశ్, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, నాగుల రాముగౌడ్, కనికరపు రాకేశ్, వస్తాదు గణేశ్, నాగుల మహేశ్, మెండె రాజు, కొనకాని రాజు పాల్గొన్నారు.

మద్యం బాటిల్‌తో ఎస్సై వీడియో వైరల్

- నిన్న చనిపోతానంటూ చేసిన వీడియో
- నేడు మద్యం సేవిస్తూ మరో వీడియో
- సామాజిక మాధ్యమాల్లో ప్రచారం
- నివ్వెరపోతున్న తోటి ఉద్యోగులు

సిరిసిల్లక్రైం: జిల్లాలోని పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఓ ఎస్సై మద్యం బాటిళ్లతో ఇష్టారీతిగా మాట్లాడుతున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. సదరు ఎస్సై గతంలో కోనరావుపేట మండలంలో దురుసుగా వ్యవహరించి సస్పెన్షన్‌కు గురయ్యారు. అనంతరం ఎస్పీలో కొన్నేళ్లు పనిచేశారు. అనంతరం జరిగిన అంతర్గత బదిలీల్లో ఓ ఠాణాకు కొద్దిరోజులు ఎస్‌హెచ్‌వోగా పనిచేశారు. ఇంతలోనే ఏం జరిగిందో తెలియదు ముందుగా ఇచ్చిన ఎస్‌హెచ్‌వో నుంచి మళ్లీ నిగూఢంగా ఏదైన అసాంఘిక కార్యాలాపాలు చేపట్టే వారిని పట్టుకునే విభాగానికి బదిలీ అయ్యారు. పోస్టింగ్ రావడం లేదనో.. పనిచేసిన గుర్తింపు దక్కడం లేదనో కానీ సదరు ఎస్సై కొన్నాళ్లుగా మానసికంగా వేదనకు గురవుతున్నట్లు తోటి ఉద్యోగులు చెబుతున్నారు. నిన్న కూడా ఒక వీడియోలో ఇష్టారీతిగా మాట్లాడినట్లు ఉద్యోగుల మధ్యలో చర్చ సాగుతోంది. ఇది మరువకముందే ఆదివారం మరో వీడియోతో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాడు. ఒక బాధ్యతయుతమైన పదవిలో ఉంటూ ఇలాంటి వీడియోలు చేయడం సరికాదనే భావన తోటి ఉద్యోగుల్లోనూ ఉంది.

క్రీడాకారులకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తా

- డాక్టర్ గోలిమోహన్



టీ షర్టులు అందజేస్తున్న గోలి మోహన్

వేములవాడరూరల్: క్రీడాకారులకు తన వంతుగా ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని డాక్టర్ గోలిమోహన్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలో రాయల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు టీషర్టులు అందించారు. గోలి మోహన్ మాట్లాడుతూ ఆల్కహాల్, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చేపడుతున్న క్రీడాపోటీలను అభినందించారు. యువత చెడు అలవాట్లకు లోనుకావద్దని కోరారు.

రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: రైస్ మిల్లర్ల దోపిడిని ప్రభుత్వం అరికట్టాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని అగ్రహారం గ్రామంలో ఆదివారం పార్టీ జెండా విష్కరించారు. ఈ సందర్భంగా 20 మంది గ్రామస్తులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పారు. అనంతరం మాట్లాడుతూ రైస్ మిల్లర్లు తరుగు పేరిట క్వింటాలుకు 8 కిలోల వరకు కోతలు విధించి రైతులను నష్టపరుస్తున్నారన్నారు. వడగండ్ల వానకు నష్టపోయి ఉన్న రైతులను ఇప్పుడు మిల్లర్లు మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే మంత్రి కేటీఆర్ విదేశాల్లో జల్సాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మామిండ్ల కిషన్, షేక్‌గౌస్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సోనియా గాంధీకి రుణపడి ఉండాలి

తంగళ్లపల్లి: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి రుణపడి ఉండాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేశాయిపల్లెలో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామానికి చెందిన్న సీనియర్ నాయకుడు గట్టు రాజిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 150 మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర ప్రయోజనాలకంటే కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమని ఆరోపించారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని ఎంతమందికి ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టు లింగారెడ్డి, దేవయ్య, రవి, ప్రవీణ్ జే టోని పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



శిబిరానికి వచ్చిన ప్రజలు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో పీపుల్స్ హాస్పిటల్, యశోద హాస్పిటల్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ చింతోజు రాజారాం, శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కార్డియక్, న్యూరో, ఆర్థోపెడిక్ వైద్య బృందం రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. టుడీ ఈకో, ఈసీజీ, రక్త, మూత్ర పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. జిల్లా నలుమూలల నుంచి 300 మందికి పైగా ప్రజలు వైద్య శిబిరానికి తరలివచ్చారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయిస్తామన్నారు. యశోద ఆసుపత్రి వైద్య బృందం చరణ్‌రెడ్డి, అరవింద్, యాసిర్, శివాని, మధు, కృష్ణ, అభిరామ్, నవీన్, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి సిబ్బంది సంతోష్, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

ప్రజాగర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

వీర్నపల్లి: సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4న ప్రకాశం స్టేడియం, కొత్తగూడెంలో నిర్వహించే ప్రజాగర్జన బహిరంగసభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మండలంలోని అన్ని కార్మిక అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జల ప్రభాకర్, లద్దూరి నర్సయ్య, కోనేటి పర్శయ్య, మండల సీపీఐ నాయకులు రైతులు పాల్గొన్నారు.

పార్లమెంట్ భవన ప్రారంభంపై హర్షం



ప్రధానికి జేజేలు పలుకుతున్న బీజేపీ నాయకులు

సిరిసిల్లటౌన్/రుద్రంగి/వీర్నపల్లి: నూతన పార్లమెంట్ సెంట్రల్ విస్టాను ప్రధాని మోదీ ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శివనగర్ శ్రీరాజరాజేశ్వర ఆలయంలో రుద్రంగి, వీర్నపల్లి హనుమాన్ ఆలయాల్లో పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు గునుకుల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని క్షేమంగా ఉండాలని కోరుతూ పూజలు జరిపారు. పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, నాయకులు శిరస్వాల్ కైలాష్, మోర శ్రీహరి, ఊరగొండ రాజు, చొప్పదండి శ్రీనివాస్, రమేష్, మల్లేశం, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు కోనరావుపేట మండల సమావేశం

కోనరావుపేట: మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్లకల్చరల్: ఇంటర్‌లో గరిష్ఠ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు డాక్టర్ కోటగిరి పూర్ణచందర్ స్మారకార్థం పురస్కారాలు అందజేయనున్నట్లు సతీమణి కోటగిరి సుధాపూర్ణచందర్ తెలిపారు. తన కుమారుడు కోటగిరి వంశీకృష్ణ పేరిట మరో ప్రతిభా పురస్కారాన్ని కూడా అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు రూ.10,116ల నగదుతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తామన్నారు. విద్యార్థులు మార్కుల జాబితాతో పాటు పూర్తి బయోడేటా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన బయోడేటాను సిరిసిల్ల వాసవీనగర్‌లోని శ్రీ సత్యసాయి మందిరంలో అందజేయాలని, వివరాలకు 79891 83439 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గురుకుల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

వేములవాడరూరల్: వేములవాడ పరిధిలోని శాత్రాజుపల్లి రోడ్డులోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీయూజీసెట్ ఫలితాల ప్రకటన అనంతరం మొదటి విడత ప్రవేశాల జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. టీఎస్‌డబ్ల్యూర్ డీసీడబ్ల్యూ సిరిసిల్లలో సీటు సాధించిన విద్యార్థినులు టీజీయూజీసెట్ హాల్‌టికెట్, అలాట్‌మెంట్ కార్డు, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ మెమోలు, ఇంటర్ టీసీ, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్సులు రెండు సెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు ఐదు సమర్పించాలన్నారు. ఎంపీసీ, ఎమ్ఎస్‌టీసీఎస్, బీఏ, బీకాం సీఏ, గ్రూప్ విద్యార్థులు జూన్ 1న, బీజెడ్సీ విద్యార్థులు జూన్ 2న కళాశాలలో సమర్పించి సీటు నిర్ధారించుకోవాలని ఆమె కోరారు.

నీటి తొట్లు నిరుపయోగం

- నీటి వసతి కల్పించడంలో నిర్లక్ష్యం
- తాగునీటికి అల్లాడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



లింగన్నపేటలో చెట్ల పొదల మధ్య పశువుల తొట్టి

గంభీరావుపేట: మూగజీవాల దాహార్తిని తీర్చడానికి గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లు నిర్వహణ కొరవడి నిరుపయోగంగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు నీటి తొట్ల నిర్వహణను మరిచిపోయారు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన తొట్లు ప్రస్తుతం గ్రామాల్లో సగానికి పైగా నిరుపయోగంగానే ఉన్నాయి. కొన్ని చోట్ల తొట్లు ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల చెత్తాచెదారంతో నిండి చెట్ల పొదల మధ్య కూరుకుపోయాయి. ఎండలు మండిపోతున్న తరుణంలో మూగజీవాలకు నీరు లభించక గోసపడుతున్నాయి. చెరువులు, కుంటలు, బోరుబావుల దగ్గరకు నీళ్ల కోసం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆరేళ్ల క్రితం

వేసవిలో మూగజీవాలు దాహంతో అల్లాడకూడదనే లక్ష్యంతో ఆరేళ్ల క్రితం ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నీటి తొట్లు నిర్మించారు. గ్రామానికి నాలుగైదు ప్రదేశాల్లో పశువుల తొట్లు నిర్మించారు. నీటి తొట్లలో నీరు లేక పగుళ్లుబారుతున్నాయి. నీటి సౌకర్యం ఉన్న చోటనే తొట్లు నిర్మించామని అధికారులు చెబుతున్నా నీటి వసతి కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. బోరుమోటార్లు చెడిపోయి, పైపులైన్ మరమ్మతులు చేయకపోవడం, విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల నీటి తొట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

వినియోగంలోకి తెస్తేనే మేలు

గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి చిన్నపాటి మరమ్మతులతో నీటి తొట్లను వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉంది. గ్రామపంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధకశాఖ అధికారులు స్పందించి మూగజీవాల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



మా గ్రామంలో నిర్మించిన నీటితొట్లు చాలా వరకు నిరుపయోగంగానే ఉన్నాయి. వీటికి నీటి సౌకర్యం కల్పించడం లేదు. తొట్లలో చెత్తాచెదారం పేరుకుపోయింది. రైతులు పశువుల దాహార్తి తీర్చేందుకు చెరువులు, కుంటలను ఆశ్రయించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి నీటితొట్లను వినియోగంలోకి తేవాలి.

– సురేశ్, లింగన్నపేట

అధికారులు పట్టించుకోవాలి



నీటి తొట్ల నిర్వహణను అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికొదిలేశారు. ఎవరు పట్టించుకోకపోవడంతో తొట్లు ధ్వంసమైపోతున్నా యి. నీటి కోసం మూగజీవా లు అల్లాడిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు నీటి సౌకర్యం లేని వాటికి మిషన్ భగీరథ ద్వారా నీటి వసతి కల్పించాలి. కూలిపోతున్న వాటిని మరమ్మతులు చేయించాలని కోరుతున్నాం.

– లక్కం బాబు, గంభీరావుపేట

చర్యలు తీసుకుంటాం



ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించిన నీటి తొట్ల నిర్వహణ బాధ్యత గ్రామపంచాయతీలదే. నిరుపయోగంగా మారిన వాటిని వినియోగంలోకి తెచ్చే విధంగా పంచాయతీ అధికారులకు ఆదేశాలిస్తాం. మరమ్మతుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నీటి సౌకర్యం లేని వాటి వివరాలు సేకరించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షిస్తాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన గూడ ఎల్లయ్య రూ.16 వేలు, మల్లమారి సునీల్ రూ.14,500, కొండికొప్పుల అక్షిత రూ.15వేలు సీఎం సహాయనిధి చెక్కులను సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ, ఎంపీటీసీ స్రవంతి ఆదివారం బాధితులకు అందజేశారు.

పుస్తెమట్టెలు పంపిణీ

వేములవాడ: మున్సిపల్ పరిధిలోని నాంపల్లి శివారులోని తెనుగుపల్లిలోని నిరుపేద కుటుంబానికి చెందిన పోతిరెడ్డి కనుకయ్య- కనుకవ్వల కుమార్తె పెళ్లికి మన చారిటబుల్ ట్రస్టు ద్వారా పుస్తెలు, మట్టెలు అందజేశారు. అలాగే మోటూరి మధు, ప్రవీణ్‌ల సహకారంతో చీర, సారె, వంట సమాగ్రిని ఆదివారం వారింటికి వెళ్లి అందజేసినట్లు ట్రస్టు ప్రతినిధులు మోటూరి మధు, చేపూరి రమేశ్, గజ్జెల రాజశేఖర్, కట్ట శ్రీనివాస్, కొమురవెల్లి శివుడు, లాల దేవయ్య తెలిపారు.

అన్నదానం

వేములవాడ: వేములవాడ రాజన్న గుడి వద్ద ఆదివారం 150 మంది పేదలకు మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ద్వారా అన్నదానం నిర్వహించారు. 744 రోజులుగా అన్నదానం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు

కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలి

బోయినపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట మిల్లర్లు క్వింటాల్‌కు ఐదు కేజీలపైనే ధాన్యం కట్ చేస్తున్నారని కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ఓవైపు వర్షాకాలం ప్రారంభం కానున్న సమయంలో ఇప్పటికీ కొనుగోళ్లు పూర్తికాకపోవడం దారుణమన్నారు. లారీల కొరత సైతం వేధిస్తోందని తెలిపారు. అధికారులు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గ కోకన్వీనర్ ఉదారి నర్సింహాచారి, నాయకులు పాల్గొన్నారు.

పూర్తయిన కొనుగోళ్లు

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసినట్లు పోతుగల్ సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు ఆదివారం తెలిపారు. జిల్లాలోనే ముందుగా ఆవునూర్‌లో వరి కోతలు ప్రారంభం అవుతాయని, సింగిల్‌విండో ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో సేకరించి పూర్తిచేయడం జరిగిందన్నారు. ప్రజాప్రతినిధులు, డైరెక్టర్లు, సిబ్బంది, హమాలీల సహకారంతో కొనుగోళ్లు విజయవంతంగా చేపట్టామన్నారు.